క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని సత్యం జంక్షన్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్–1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం, సత్యం జంక్షన్, సునీత నర్సింగ్ హోం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మద్రిపాలెం ఫీడర్ పరిధిలో..

మద్రిపాలెం: జోన్–2 ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ 11 కేవీ మద్రిపాలెం ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శంకర్‌నగర్, జ్యోతినగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

అయ్యప్పస్వామి భక్తులకు అన్నదానం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం శ్రీ శాంతిస్వరూపిణి దుర్గమ్మ ఆలయ ఆవరణలో కేఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి భక్తులకు గురువారం అన్నదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో 700 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వార్డు టీడీపీ అధ్యక్షురాలు బర్ల పద్మలత, నక్కవానిపాలెం గ్రామ అధ్యక్షుడు గుడ్ల కాత్రాజురెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఎన్నికలకు ఏర్పాట్లు

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

మురళీనగర్: మురళీనగర్‌లో అత్యంత ప్రాధాన్యం కలిగిన వాకర్స్ క్లబ్ 2025 సంవత్సరం నూతన కార్యవర్గం ఎన్నికలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ గురువారంతో ముగిసింది. పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటించాల్సి ఉంది. పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. క్లబ్‌లో 877మంది సభ్యులు ఉన్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, జాలీ వాకర్ పోస్టులతో పాటు 9 మంది బోర్డ్ డైరెక్టర్ల పోస్టులకు డిసెంబరు 8న ఉదయం 9 గంటల నుంచి 12.30 వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు ఏడాది పాటు పదవిలో ఉంటారు. ఆశావహులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

ఆకట్టుకున్న 'కన్యాశుల్కం'



కన్యాశుల్కం నాటకం ప్రదర్శిస్తున్న విశాఖ రచయితలు

సీతంపేట: మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం సాయంత్రం రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కన్యాశుల్కం సంక్షిప్త నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. నాటకంలో పాత్రధారులుగా విశాఖలోని రచయితలందరూ నటించి, మెప్పించారు. ప్రముఖ రచయిత మేడా మస్తాన్‌రెడ్డి పర్యవేక్షణలో నాటక ప్రదర్శన ఆహుతులను అలరించింది. డాక్టర్ పేరి రవికుమార్ దర్శకత్వం వహించారు.

వైద్య శిబిరానికి స్పందన

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేంద్రీయ విద్యాలయంలో రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అగర్వాల్ నేత్ర వైద్య పరీక్షలు చేసి ఉచితంగా కళ్ల జోళ్లు, మందులు అందజేశారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ గంగాధర్, క్లబ్ కార్యదర్శి రొటేరియన్ రాజేష్, ప్రాజెక్ట్ డైరెక్టర్స్ షీలా, సుష్మా, ప్రశాంతి, రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ సునీతలావణ్య, పూర్వ అధ్యక్షులు కె.కిరణ్‌కుమార్, బైరెడ్డి, పిబిఎస్ఎన్ రెడ్డి, క్లబ్ మెడికల్ డైరెక్టర్ ఒమ్మి కిరణ్‌కుమార్ వైద్యులు రాజు, శ్రీనివాస్ రెడ్డి హరిత, నగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడాకుల చెట్లు.. ఆరోగ్యానికి తూట్లు

ఏడాకుల చెట్టు.. చూడటానికి అందంగా కనిపించే ఈ చెట్టును సప్తవర్ణి, డెవిల్ ట్రీ అని పిలుస్తుంటారు. నియోజకవర్గంలో ఈ చెట్లు అధికంగా కనిపిస్తున్నాయి. వీటి నుంచి చాలా ప్రమాదకరమైన విషయ వాయువు వెలువడుతుంది. దీని పుప్పొడి రేణువులు మానవాళికి అత్యంత ప్రమాదకరమని, శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా, అలర్జీ వంటివి వస్తుంటాయని, ఆ చెట్టు కింద ఉండే వారికి స్పృహ కోల్పోయే ప్రమాదముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అనారోగ్యానికి గురిచేసే ఏడాకుల చెట్లపై నియోజకవర్గ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషవృక్షాలను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

- వ్యాధులకు కారణమవుతున్న విషవృక్షాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- తక్షణం తొలగించాలని డిమాండ్



తాటిచెట్లపాలెంలో ఇళ్లలోకి వ్యాపించిన ఏడాకుల చెట్లు



నరసింహనగర్‌లో ఏడాకుల చెట్లు



సింగాలమ్మపురం వద్ద ఏపుగా పెరిగిన ఏడాకుల చెట్లు

తాటిచెట్లపాలెం: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏపుగా పెరిగిన ఏడాకుల చెట్లు విష వాయువులు చిమ్ముతున్నాయి. రోగాల బారిన పడేసే ఈ వృక్షాలను తొలగించాలని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని పలు కాలనీల వాసులు వాపోతున్నారు. ప్రాణవాయువును ఇవ్వాల్సిన పచ్చని చెట్లు విషం చిమ్మడమేంటని అనుకుంటున్నారా.. చాలా చెట్లు మానవాళికి మేలు చేసినా.. కొన్ని మాత్రం హాని కూడా చేస్తుంటాయి. ఈ జాబితాలో ఉన్న వృక్షాలే ఏడాకుల చెట్లు. అల్‌స్టోనియా స్కాలరిస్ అనే శాస్త్రీయ నామంతో పిలువబడే ఈ చెట్లు మనుషులకు ఎంతో హాని చేస్తాయని పలువురు నిపుణులు, వైద్యులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది పలు పరిశోధనల్లో కూడా నిజమైంది. చెట్ల పూత, పువ్వుల నుంచి వచ్చే వాసన పీల్చడం వల్ల తలనొప్పి, అలర్జీ, బ్రాంకైటిస్, ఆస్తమా వంటి పలు వ్యాధులు సంక్రమించడానికి అవకాశం ఉంటుంది. పలు నగరాలు ఈ చెట్లను పూర్తిగా నిషేధించాయి. మన విశాఖ మాత్రం ఈ వృక్షాలు చాలా చోట్ల ఉండి ప్రజలకు ప్రాణాంతకంగా మారాయి.

42, 45 వార్డుల్లో ప్రాణాంతకంగా.. : జీవీఎంసీ 42, 45 వార్డుల్లోని చాలా ప్రాంతాల్లో ఏడాకుల చెట్లు ఏపుగా పెరిగి ప్రమాదకరమైన వాసనలు వెదజల్లుతున్నాయి. ముఖ్యంగా నరసింహనగర్, రైల్వే న్యూకాలనీ, తాటిచెట్లపాలెం, సింహగిరి కాలనీ ప్రాంతాల్లో ఈ వృక్షాలు ప్రజలకు హాని చేకూరుస్తున్నాయి. హుద్‌హుద్ తుపాను అనంతరం విశాఖలో నాటిన ఈ మొక్కలు నేడు ప్రాణాంతకంగా మారాయి. ఏపుగా పెరిగి పూత వేసి, అందమైన పుష్పాలతో విషవాయువులు వెదజల్లుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఏడాకుల చెట్లను తక్షణం తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోలేదు



తాటిచెట్లపాలెంలోని మా ఇళ్లలోకి ఏడాకుల చెట్లు వ్యాపించాయి. వీటిని తొలగించాలని ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. మేం చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– దువ్వి కాశీప్రసాద్, కేసరియా హిందూ వాహిని రాష్ట్ర అధ్యక్షుడు

వ్యాధులతో బాధపడుతున్నాం



ఏడాకుల చెట్ల నుంచి వచ్చే గాలి వల్ల తలనొప్పి, జ్వరం వంటి వ్యాధులతో బాధపడుతున్నాం. ఈ చెట్లు మంచివి కాదని చెబుతున్నా.. వినడం లేదు. వెంటనే అధికారులు ఈ చెట్లను తొలగించి ప్రజలకు ఆరోగ్యాన్ని ఇచ్చే మొక్కలు నాటాలి.

– పి.రాజి, తాటిచెట్లపాలెం

ఏడాకుల చెట్లను తొలగించాలి



ఈ చెట్ల పూత నుంచి వచ్చే వాసన పీల్చడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నాం. వీటి వల్ల లేని జబ్బులు కూడా వస్తున్నాయి. సింహగిరి కాలనీ, సింగాలమ్మపురం, నరసింహనగర్ ప్రాంతాల్లో ఏడాకుల చెట్లు చాలా ఉన్నాయి. వెంటనే వీటిని తొలగించాలి.

– తిరుపతిరావు, సింహగిరి కాలనీ

ఊపిరి పీల్చుకోలేకపోతున్నాం



ఏడాకుల చెట్ల నుంచి వచ్చే వాసన వల్ల కొన్ని సార్లు ఊపిరి పీల్చుకోలేకపోతున్నాం. ఇవి బాగా పెరిగిపోయి, పూలు, పూత వేశాయి. వీటి నుంచి వచ్చే వాసనతో స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారు. మాలాంటి పెద్దలు శ్వాస తీసుకోలేకపోతున్నాం.

– పోలినాయుడు, తాటిచెట్లపాలెం

వాకర్స్ పార్కులో అదనపు సౌకర్యాలు



వాకర్స్ క్లబ్ ప్రతినిధులతో చర్చిస్తున్న జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో అదనపు సౌకర్యాల కల్పనకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. వాకర్స్ పార్కు రక్షణ, ఇతర సౌకర్యాలకు చర్యలు తీసుకోవాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో సభ్యులు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును ఇటీవల కలిసి వినతిపత్రం అందించారు. ఆయన స్పందించి వాకర్స్ పార్కులో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ ద్వారా తెలిపారు. పార్కులో 1980లో నిర్మించిన ప్రహరీ గోడ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, నడక మార్గం శిథిలమై వాకర్స్‌కు అసౌకర్యంగా మారిందని వీటి స్థానంలో కొత్తవి నిర్మించాల్సి ఉందన్నారు. సమావేశ ప్రాంగణం పైకప్పు నిర్మాణం, పాడైన ఓపెన్ జిమ్ పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటుతోపాటు అదనపు పరికరాల ఏర్పాటు, ల్యాండ్ స్కేపింగ్, బ్యూటిఫికేషన్‌కు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది గురువారం పార్కును సందర్శించి క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్యతో చర్చించారు. సౌకర్యాల కల్పనకు సిబ్బంది సర్వే చేసి నివేదిక తయారు చేశారు.

మాస శివరాత్రి పూజలు నేడు

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా శంకరమఠం రోడ్డులోని రామలింగేశ్వరాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుగుతుందని ఆలయ ఈవో జి.వి.రమాబాయి తెలిపారు. 29వ తేదీ మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

లలితా పీఠంలో...

లలితానగర్ శ్రీలలితా పీఠంలో కాశీ కాలభైరవులకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఒక ప్రకటనలో తెలిపారు.

స్ఫూర్తిప్రదాత జ్యోతిరావు పూలే



పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న గొల్లమాల అప్పారావు



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఈపీడీసీఎల్ డైరెక్టర్లు

కంచరపాలెం: సమ సమాజ స్థాపనలో భావితరాలకు స్ఫూర్తిప్రదాతగా నిలిచిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కొనియాడారు. ఊర్వశి కూడలిలోని దళిత సేన కార్యాలయంలో గురువారం పూలే వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలు, వృద్ధులకు గొల్లమాల అప్పారావు పండ్లు, రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, నగర మహిళా కన్వీనర్ గొల్లమాల మీనా, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారామ్, నగర ప్రధాన కార్యదర్శి సిహెచ్.మల్లికార్జునరావు,రఘాన్సీరాణి పాల్గొన్నారు.

సంఘ సంస్కర్తకు నివాళి

సీతంపేట: రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ సౌత్ ఇన్‌చార్జి శివప్రసాద్, కార్పొరేటర్లు,



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

నాయకులు కందుల నాగరాజు, పీతల మూర్తి యాదవ్, కంటిపాము కామేశ్వరి, గొలగాని వీరారావు, అమరాపు దుర్గ, లక్ష్మీచౌదరి, నారా నాగేశ్వరరావు, మద్రివేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో..

సీతమ్మధార: ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలోని పూలే విగ్రహానికి సంస్థ డైరెక్టర్లు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, ఎస్.వి.రమణమూర్తి, చీఫ్ జనరల్ మేనేజర్లు డి.సుమన్ కల్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవి కుమార్, ఎస్.హరిబాబు, జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో రైవాడ మంచి నీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టీఎస్సార్‌కు వచ్చే మంచినీటి సరఫరాల జరిగే ప్రధాన 800 పీఎస్‌సీ పైపులైన్ బిర్లా జంక్షన్ కూడలి వద్ద లీకైనందున లీకేజీ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా జోన్–3, జోన్–5, జోన్–8లో శుక్రవారం (ఈ నెల 29) ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీరు కేవీఎన్ రవి ఒక ప్రకటనలో తెలిపారు.

జోన్–3 పరిధిలో..

జోన్–3 పరిధి డాక్టర్స్ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, అంబేడ్కర్ నగర్, ఇందిరాగాంధీ బొమ్మ లైన్, చైతన్య నగర్, కనకమ్మ టెంపుల్ ఏరియా, కెప్టెన్ లైన్స్, గాంధీనగర్ ఏరియా, శారదా స్కూల్ లైన్, ఓల్డ్ కోపరేటివ్ బ్యాంక్ లైన్, క్రాంతినగర్, ఎన్‌హెచ్–16 రోడ్డు ఏరియా, రామకృష్ణానగర్, 80 ఫీడ్ రోడ్డు ఏరియా, ఎన్‌జీజీవోస్ కాలనీ, చిన్నూరు, మంగళవీధి, లలితానగర్ తదితర ప్రాంతాలు.

జోన్–5 పరిధిలో..

జోన్–5 పరిధి మద్రిపాలెం, జ్యోతినగర్, మహారాణిపేట, బాపూజీనగర్, మాధవధార వుడా లేఅవుట్, మాధవధార, కళింగనగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, పట్టాభిరెడ్డి తోట, సూర్యనగర్, సిద్ధార్థనగర్, తుమ్మడిపాలెం, సుభాష్‌నగర్, భవానీగార్డెన్స్, కస్తూరి నగర్–1, శాంతినగర్–1,2, సంజీవయ్య నగర్ హిల్ ఏరియా, బాపూజీనగర్–1,2, అంబేడ్కర్ ఎస్టేట్, సురేష్‌రామ్‌నగర్, పెద్ద కొత్తూరు హిల్ ఏరియా, డౌన్ ఏరియా, రాంజీ ఎస్టేట్ డౌన్ ఏరియా, తిక్కవానిపాలెం, జయప్రకాష్‌నగర్, కప్పరాడ–1,2, ఇందిరానగర్–4,5, మహాత్మాగాంధీ నగర్, జవహర్‌లాల్ నగర్, ఏఎస్ఆర్ నగర్, శ్రీనివాసనగర్, పోలీస్ క్వార్టర్స్, పలనాటి కాలనీ, గోకుల్ నగర్, గొల్ల కంచరపాలెం, దుర్గానగర్, శ్రీనివాసనగర్, నందగిరి నగర్, చెక్కుడురాయి బిల్డింగ్ ఏరియా, దాడి రామ్మూర్తి కల్యాణమండపం ఏరియా, 24/7 వాటర్ సప్లై ఏరియాలు.

జోన్–8 పరిధిలో..

జోన్–8 పరిధి శ్రీరామనగర్, శ్రీనుబాబునగర్, అజంతా పార్క్, టైలర్స్ కాలనీ, వుడా కాలనీ, పవర్ ఆఫీస్ ఎదురుగా, ఆర్ఆర్‌వీ పురం, రజక కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయానికి చింతిస్తూ జీవీఎంసీ కమిషనర్ తరఫున నగర ప్రజలు సహకరించాలని పర్యవేక్షక ఇంజనీరు తెలిపారు. 30న శనివారం యథావిధిగా నీటి సరఫరా పునరుద్ధరించి సరఫరా చేయనున్నట్టు తెలిపారు.

కంచరపాలెం సెక్షన్ పరిధిలో.

కంచరపాలెం: జోన్–2 డివిజన్ కంచరపాలెం సెక్షన్ పరిధి సబ్ స్టేషన్‌లో 11 కెవీ కంచరపాలెం ఫీడర్ లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఈఈ బీకె నాయుడు తెలిపారు. దుర్గానగర్, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, గోకుల్‌నగర్, గౌరీనగర్, తోటవీధి, మల్లసూరివీధి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించాలి కోరారు.

సీబీసీఐవో ఆర్‌టీఐ ఫోరం జిల్లా కమిటీ నియామకం



జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న పోతన నాగేశ్వరరావు



నియామక పత్రం అందుకుంటున్న కెల్లా లక్ష్మి

తాటిచెట్లపాలెం: కంట్రోల్ బోర్డ్ ఆఫ్ కరప్షన్ ఆక్టోపస్(సీబీసీఐవో) ఆర్‌టీఐ ఫోరం అసోసియేషన్ విశాఖ జిల్లా కమిటీ నియామకం గురువారం జరిగింది. ఫోరం జిల్లా అధ్యక్షుడిగా తాటిచెట్లపాలేనికి చెందిన పోతన నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా రైల్వే న్యూకాలనీకి చెందిన కెల్లా లక్ష్మిని నియమించినట్లు ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వి.వి.సత్యనారాయణ వెల్లడించారు. తమ ఫోరం అవినీతిపై నిరంతరం పోరాడుతుందని, ప్రజల శ్రేయస్సు కోసం నిత్యం పనిచేస్తుందని తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ప్రజల తరపున నిరంతరం అవినీతిపై పోరాటం చేస్తామని పోతన నాగేశ్వరరావు, కెల్లా లక్ష్మిలు తెలియజేశారు. నగరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అక్కిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాత గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్



రైల్వే పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు

తాటిచెట్లపాలెం: పాత గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.శాంతారం తమ సిబ్బందితో కలిసి గురువారం పలు ప్లాట్‌ఫారాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో పాత గంజాయి కేసులో నిందితుడు హైదరాబాద్ ధూల్‌పేటకు చెందిన రాజ్‌సింగ్ గంజాయిని రవాణా చేయడానికి రెక్కీ నిర్వహిస్తుండగా పట్టుకున్నారు. ఇతడిని అరెస్ట్ చేసిన ఎస్ఐ శాంతారం రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు.

ఉద్యోగులు నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ జీఎం కె.వి.రావు

సీతంపేట: సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఎప్పటికప్పుడు సంస్థ అభివృద్ధికి తోడ్పడే విషయాల గురించి తెలుసుకుంటూ, నైపుణ్యాలను పెంచుకోవాలని స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ కె.వి.రావు సూచించారు. నేషనల్ హెచ్‌ఆర్‌డీ నెట్‌వర్క్ విశాఖపట్నం శాఖ గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'లెర్నింగ్ సైకిల్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. సంస్థ యాజమాన్యాలు కూడా తమ ఉద్యోగుల పని సామర్థ్యం పెంచడం కోసం వారికి సహకరిస్తూ ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య నాదెండ్ల సాంబశివరావు, వి.భాస్కర్ శ్రీనివాస్, కృష్ణకుమార్, శేషగిరిరావు, ఎస్.వి.ఎస్.సుధాకర్, శ్రీరాములు, పల్లవి, రవికుమార్, ఎస్.సుధాకర్, గోవిందరాజు పాల్గొన్నారు.

ఐటీఐలో నైపుణ్య శిక్షణ



ఉపాధి శిక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధి

కంచరపాలెం: కంచరపాలెంలోని ప్రభుత్వ ఐటీఐలో ఐఏసీఈ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పోటీ పరీక్షల నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నైపుణ్యం–శిక్షణపై సంస్థ ప్రతినిధులు బి.ప్రసాద్, సంతోష్ అవగాహన కల్పించారు. సుమారు 120 మంది విద్యార్థులు శిక్షణ పొందినట్లు నిర్వాహకులు తెలిపారు.

పది కిలోల గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

సీతమ్మధార: రైల్వేస్టేషన్ ఆవరణలో పది కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. కోచ్ రెస్టారెంట్ సమీపంలో ఫుట్‌పాత్‌పై అనుమానాస్పదంగా బ్యాగ్ ఉందన్న సమాచారంతో ఫోర్త్ టౌన్ ఎస్ఐ వెంకటరావు సోదా చేశారు. బ్యాగులో పది కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి, ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి ఆదేశాల మేరకు దానిని స్వాధీనం చేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు దీనిని వదిలి వెళ్లినట్లు గుర్తించి, పోలీసులు స్టేషన్ ఆవరణలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఎవరూ కనిపించక పోవడంతో ఫోర్త్ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నాలుగు వార్డుల్లో 24/7 నీటి సరఫరా

- రూ.48 కోట్లతో 'అమృత్ 2.0' పనులు ప్రారంభం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన అమృత్ 2.0 పథకానికి సీతమ్మధార హిల్ పార్కు సమీపంలో గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజు, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.48 కోట్లతో 24/7 తాగునీరు అందించేందుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. దీనిద్వారా 14, 23, 24, 43 వార్డుల్లో 7,760 ఇళ్లకు 99వేల మందికి మంచినీరు నిరంతరం అందుతుందన్నారు. ఉత్తర నియోజకవర్గంలో దీన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో నగరమంతా పూర్తిస్థాయిలో 24 గంటలు నీరు వచ్చేలా జీవీఎంసీ పరిధిలో పనులు జరుగుతున్నాయన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఉషశ్రీ, జనసేన ఉత్తర సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్, బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక, నాయకులు పరశురామరాజు, నజీర్, ధర్మారావు, జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్ శివప్రసాద్‌రాజు, జోనల్ కమిషనర్లు శివప్రసాద్, రాము పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో మెగా వైద్యశిబిరం



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న మ్యాక్సివిజన్ ఆస్పత్రి సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైల్వేన్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యానమందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆంధ్ర హాస్పిటల్స్, మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్స్ సహకారంతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మధ్యాహ్నం మాలధారులకు, భక్తులకు, పేదలకు, యాచకులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, ఆస్పత్రుల సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.